
సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు
ఆదివారం । 12 । అక్టోబర్ । 2025



సోమశిలలో 73.445 టీఎంసీలు

సోమశిల: జలాశయంలో శనివారానికి 73.445 టీఎంసీలు ఉన్నాయి. ఎగువ నుంచి 16,852 క్యూసెక్కుల వరద వస్తోంది. పెన్నానదికి 2650, ఉత్తరకాలువకు 50, కండలేరుకు 3800 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రా)	రూ.1,26,060
22 క్యారెట్ల ఆర్నమెంట్ (గ్రా)	రూ.11,390
3 శాతం జీఎస్టీతో	రూ.11,731
సవర (8 గ్రా)	రూ.93,848

గరిష్టం/కనిష్టం
32.9 /25.3

వాతావరణం

జిల్లాలో ఆదివారం వాతావరణం పొడిగా ఉంటుంది. అక్కడక్కడ ఆకాశం పాక్షికంగా మేఘావృతంగా ఉండే అవకాశం. శనివారం గాలిలో తేమ 72 శాతంగా నమోదైంది.

న్యూస్‌రీల్

13న జాతీయ మానవహక్కుల కమిషన్ జిల్లాకు రాక

- కలెక్టర్ హిమాన్షు శుక్లా

నెల్లూరు రూరల్: జాతీయ మానవహక్కుల కమిషన్ ఈ నెల 13 నుంచి 16వ తేదీ వరకు జిల్లాలో పర్యటించనుందని కలెక్టర్ హిమాన్షు శుక్లా శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జాతీయ మానవ హక్కుల కమిషన్ విచారణ విభాగానికి చెందిన కుల్బీర్ సింగ్, యతిప్రకాశ్ శర్మ, సంజయ్ కుమార్‌తో కూడిన బృందం అల్లిమడుగు పంచాయతీని సందర్శించి విచారణ నిర్వహించనున్నారు. ఈ బృందం అల్లిమడుగు పంచాయతీలోని ఆర్ఎస్ఆర్ ఇంజినీరింగ్ కళాశాలతోపాటు జిల్లాలోని ఇతర ప్రదేశాలను సందర్శిస్తుందన్నారు. సంబంధిత శాఖల అధికారులు, ప్రభుత్వ సంస్థలు, అధికారుల నుంచి నివేదికలను స్వీకరిస్తుందని కలెక్టర్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

కేన్సర్ ఆస్పత్రి కోఆర్డినేటర్లుగా బాధ్యతల స్వీకరణ



కోఆర్డినేటర్లను అభినందిస్తున్న ఆస్పత్రి సిబ్బంది

నెల్లూరు (టౌన్): ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ కేన్సర్ ఆస్పత్రి కోఆర్డినేటర్లుగా వేలమూరి రంగారావు, కలికి శ్రీహరిరెడ్డి శనివారం బాధ్యతలు స్వీకరించారు. వారు మాట్లాడుతూ కేన్సర్ ఆస్పత్రి అభివృద్ధికి పూర్తి సమయం కేటాయిస్తామన్నారు. రానున్న రోజుల్లో ఆస్పత్రి రోగులకు ఎలాంటి ఇబ్బందులు ఉన్నా తమ దృష్టికి తీసుకరావాలన్నారు. వాటిపై వెంటనే స్పందించి సేవలు అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ కోశాధికారి సురేష్‌కుమార్‌జైన్, మేనేజింగ్ ఇన్ కమిటీ మెంబర్ డాక్టర్ రాజేంద్రప్రసాద్, మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ నాగేశ్వరరావు, జనరల్ మేనేజర్ భక్తవత్సలరెడ్డి, డాక్టర్ హరితారాణి, డాక్టర్ మానికరెడ్డి, సబ్ కమిటీ మెంబర్లు రజనీ, ప్రతాప్‌రెడ్డి పాల్గొన్నారు.

జిల్లాకు 651 మంది కొత్త టీచర్లు

- నేడు పోస్టింగ్ ఆర్డర్లు
- రేపు ఆయా పాఠశాలల్లో జాయినింగ్

నెల్లూరు (టౌన్): ఉమ్మడి నెల్లూరు జిల్లాకు మొత్తం 651 మంది కొత్త ఉపాధ్యాయులు రానున్నారు. డీఎస్సీలో మొత్తం 668 పోస్టులకు నోటిఫికేషన్ విడుదల చేయగా, 651 పోస్టులకు ఉపాధ్యాయులను ఎంపిక చేశారు. మిగిలిన 17 పోస్టులకు అర్హత కలిగిన అభ్యర్థులు లేకపోవడంతో వాటిని నిలిపివేశారు. స్కూల్ అసిస్టెంట్లకు సంబంధించి తెలుగు-30, హిందీ-17, ఇంగ్లిష్-82, మ్యాథ్స్-63, ఫిజికల్ సైన్స్-75, సోషల్ స్టడీస్-101, ఉర్దూ-5, పీడీలు-105 మంది, ఎస్జీటీలు తెలుగు-107, ఉర్దూ-4 పోస్టులకు కొత్త ఉపాధ్యాయులు రానున్నారు. కొత్త ఉపాధ్యాయులకు ఈ నెల 10, 11 తేదీల్లో పోస్టింగ్ కోసం ఆన్‌లైన్‌లో కౌన్సెలింగ్ నిర్వహించారు. ఆదివారం కొత్త ఉపాధ్యాయులకు పోస్టింగ్ ఆర్డర్లు రానున్నాయి. వీరంతా సోమవారం ఆయా పాఠశాలల్లో జాయిన్ కావాల్సి ఉంది. అయితే వీరిలో 213 మంది స్కూల్ అసిస్టెంట్లు క్లస్టర్లకే పరిమితం కానున్నారు. వీరంతా ఉపాధ్యాయులు సెలవులు పెట్టిన సమయంలో, రిటైర్మెంట్ అయిన సమయంలో ఆయా పాఠశాలల్లో బోధన చేయనున్నారు.

శ్రీవారి దర్శనానికి 20 గంటలు



తిరుమల: తిరుమలలో శనివారం భక్తుల రద్దీ ఎక్కువగా ఉంది. క్యూ కాంప్లెక్స్‌లో కంపార్టుమెంట్లు అన్నీ నిండిపోయాయి. భక్తులు వేచి ఉన్న క్యూ కృష్ణతేజ అతిథి గృహం వద్దకు చేరుకుంది. శుక్రవారం అర్ధరాత్రి వరకు 74,468 మంది స్వామి వారిని దర్శించుకున్నారు. 26,878 మంది భక్తులు తలనీలాలు అర్పించారు. స్వామి వారికి కానుకల రూపంలో హుండీలో రూ.3.86 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనం లభిస్తోంది. దర్శన టికెట్లు లేని వారికి స్వామిని దర్శించుకునేందుకు 20 గంటల సమయం పడుతోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టికెట్లు కలిగిన వారికి 3 గంటల్లో దర్శనం లభిస్తోంది. సర్వదర్శనం టోకెన్లు కలిగిన భక్తులు నిర్దేశించిన సమయానికి మాత్రమే క్యూలోకి వెళ్లాలని, ముందుగా వెళ్లిన భక్తులను క్యూలోకి అనుమతించరని టీటీడీ స్పష్టం చేసింది.

వక్ఫ్ భూములు ఉఫ్


ఉమ్మడి నెల్లూరు జిల్లాలో 4 వేల ఎకరాలు అన్యాక్రాంతం

- నెల్లూరు నగరంలోనే 150.60 ఎకరాల భూమి
- ఉదయగిరిలో అత్యధికంగా 340.51 ఎకరాలు
- తాజాగా నెల్లూరులో రూ.50 కోట్లు విలువైన వక్ఫ్ భూములను టీడీపీ నేతలకు కట్టబెట్టేందుకు యత్నం
- పరమేశ్వర్‌నగర్‌లోని భూములను పీపీపీ విధానంలో తమ్ముళ్లకు అప్పగించే కుట్రలు
- వక్ఫ్ బోర్డు పెద్దల కనుసన్నల్లో కట్టబెట్టే యత్నంపై ముస్లిం పెద్దల ఆందోళన

కూటమి అధికారంలోకి వచ్చాక టీడీపీ నేతలు అక్రమార్జనపై దృష్టి సారించారు. జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ భూముల కబ్జాపర్వాలు కొనసాగుతుండగా తాజాగా ఈ జాడ్యం వక్ఫ్ బోర్డు భూములను తాకింది. నెల్లూరు నగరంలో అత్యంత ఖరీదైన వక్ఫ్ బోర్డు భూములను కాజేసేందుకు ఆ సంస్థ పెద్దలు రంగంలోకి దిగడంతో ముస్లిం పెద్దలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా కొన్ని దశాబ్దాలుగా నాలుగు వేల ఎకరాలు అన్యాక్రాంతం కావడంపై వాటిని తిరిగి స్వాధీనం చేయించాలని ముస్లిం పెద్దలు అధికారులకు మొరపెట్టుకుంటున్నారు. ఆక్రమణలకు గురైన భూములను స్వాధీనం చేసుకునే ప్రయత్నం చేయకపోగా, రూ.కోట్ల విలువైన భూములను పీపీపీ విధానంలో కట్టబెట్టేందుకు ప్రయత్నాలు మాత్రం చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.



నెల్లూరులోని సర్వే నంబర్లు 618-2, 523-2 భూమిలో బోర్డు ఏర్పాటు చేస్తున్న అధికారులు



వక్ఫ్‌బోర్డు భూములు అన్యాక్రాంతంపై 2022 ఫిబ్రవరి 15న ముతవలీ చేసిన ఫిర్యాదు కాపీ

సాక్షి ప్రతినిధి, నెల్లూరు: కంచె చేను మేసిన చందంగా వక్ఫ్ బోర్డు ఆస్తులను ఆ సంస్థ పెద్దలే కాజేసేందుకు దొడ్డిదారుల్లో వెళ్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. తాజాగా నెల్లూరు నగరంలో సర్వే నంబర్ 618-2, 523-2ల్లో 7.82 ఎకరాల భూమి జమీయా మసీదుకు చెందినదిగా ఆర్ఎస్ఆర్‌లో నమోదైంది. ఆ భూమి వక్ఫ్‌బోర్డుకు చెందినదిగా అధికారులు గుర్తించి మూడేళ్ల క్రితం బోర్డు ఏర్పాటు చేశారు. అయితే ఆ భూమిపై కన్నేసిన తమ్ముళ్లు రికార్డులు మార్పించి కొట్టేసేందుకు చేసిన ప్రయత్నాల్లో సఫలీకృతం అయినట్లు తెలుస్తోంది. నెల్లూరుకు చెందిన ఓ హోటల్ యజమాని వక్ఫ్ బోర్డు భూమిని సొంతం చేసుకుంటున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఈ భూమితోపాటు నెల్లూరులోని పరమేశ్వర్‌నగర్‌లో సర్వే నంబర్లు 371-2ఏ, 117-2, 118,119,120-2ల్లో 13.3 ఎకరాలు భూమి రెవెన్యూ రికార్డుల్లో వక్ఫ్ బోర్డు ఆస్తిగా ఉంది. జామీయా మసీదు కిందకు వస్తుంది. ఆ భూమిని టీడీపీ నేతలకు పీపీపీ విధానంలో కట్టబెట్టేందుకు రంగం సిద్ధం చేశారు. ఆ భూములను చదును చేసి తమ్ముళ్లకు కట్టబెట్టేందుకు చేస్తున్న ప్రయత్నాలపై ముస్లిం మత పెద్దలు అడ్డుకున్నారు.

4 వేల ఎకరాల భూమి పరాధీనం

ఉమ్మడి నెల్లూరు జిల్లాలో నెల్లూరు నగరంతో సహా 31 మండలాలోల వక్ఫ్ బోర్డు భూములు దశాబ్దాలుగా అన్యాక్రాంతంలో ఉన్నాయి. వీటిలో అనేక ప్రాంతాల్లోని భూములు సాగు పేరుతో తీసుకుని రికార్డులు మార్చేసుకుని కొందరు అనుభవిస్తుండగా, మరికొన్ని సేవా కార్యక్రమాలకు కేటాయించిన భూములు కూడా ఆక్రమించారు. రెవెన్యూ అధికారులు నిబంధనల విరుద్ధంగా పట్టాలు ఇవ్వడంతో రిజిస్ట్రేషన్ శాఖ కార్యాలయంలో చాలా చోట్ల భూములు క్రయవిక్రయాలు జరిగాయి. జిల్లాలో దాదాపు 4 వేల ఎకరాల భూమి పరాధీనంలో ఉన్నట్లు వక్ఫ్ బోర్డు అధికారులు గతంలో లెక్క తేల్చారు. నెల్లూరు నగరంలో ఖరీదైన ప్రాంతాలుగా ఉన్న మాగుంట లేఅవుట్, పొగతోట, సరస్వతీ నగర్, ఫత్తేఖాన్‌పేట, స్వతంత్ర పార్క్‌తోపాటు మరికొన్ని ప్రాంతాల్లో కలిపి 49 సర్వే నంబర్లలో 150.60 ఎకరాలు ఆక్రమణల్లో ఉన్నట్లు నిర్ధారించారు. ఉదయగిరి మండలంలో 5 సర్వే నంబర్లలో 340.51 ఎకరాల భూమి ఆక్రమణల్లో ఉంది. చట్ట ప్రకారం వక్ఫ్ బోర్డు భూముల్ని ఆక్రమించటం నేరం. అయితే జిల్లాలో వక్ఫ్‌బోర్డు ఏర్పాటు కావడానికి ముందు నుంచే ఇనాం భూములు, సర్వీసు భూములు, ముత్తావలీలకు కౌలుకు ఇచ్చిన భూములను అప్పటి రెవెన్యూ అధికారులు ఇష్టారాజ్యంగా పట్టాలు జారీ చేశారు. రెవెన్యూ రికార్డుల్లో ఉండే ఆర్ఎస్ఆర్ వివరాలను రెవెన్యూ అధికారులు పరిగణలోకి తీసుకోకుండా భూములకు పట్టాలు ఇవ్వడంతో క్రయవిక్రయ రిజిస్ట్రేషన్లు కూడా కొనసాగుతూనే ఉన్నాయి. 1954లో కేంద్ర చట్టంను అనుసరించి వక్ఫ్‌బోర్డు ఏర్పాటైంది. ఏపీ వక్ఫ్ బోర్డు యాక్ట్ 1954 ప్రకారం ధార్మిక కార్యక్రమాలకు, ముతావలీలకు కేటాయించిన సర్వీసు భూములను క్రయవిక్రయాలు చేయడం నేరం అవు తుంది. అయితే చట్టానికి ముందు నుంచే ఆక్రమణల పర్వం కొనసాగుతూనే ఉంది. ఈ విషయాన్ని వక్ఫ్‌బోర్డు అధికారులు అనేక పర్యాయాలు గత ప్రభుత్వం దృష్టికి తీసుకువచ్చినా పట్టించుకోని పరిస్థితి. ఈ నేపథ్యంలో గత ప్రభుత్వంలో సర్వే చేసి ఆస్తుల పరిరక్షణ కోసం ప్రయత్నాలు చేశారు. అంతలోపే ఎన్నికలు రాగానే ఆ ప్రక్రియ ఆగిపోయింది.

ఎక్కడ.. ఎంతెంత..

ప్రాంతం	ఎన్ని సర్వే నంబర్లు	ఆక్రమణ (ఎకరాల్లో)
నెల్లూరు నగరం	49	150.60
కోవూరు	34	78.79
రాపూరు	25	58.50
విడవలూరు	91	2.00
కొడవలూరు	5	7.14
పొదలకూరు	11	13.61
టీపీ గూడూరు	13	22.01
వెంకటాచలం	4	13.70
బుచ్చిరెడ్డిపాళెం	11	53.04
ఆత్మకూరు	7	45.00
ఏఎస్‌పేట	14	91.33
చేజర్ల	4	96.97
కలువాయి	2	74.51
సంగం	4	11.59
సీతారామపురం	5	64.49
మర్రిపాడు	2	19.49
ఉదయగిరి	5	340.91
అనంతసాగరం	13	32.46
కావలి	3	140.59
అల్లూరు	2	69.92
దగదర్తి	2	9.75
కొండాపురం	1	11.43
జలదంకి	1	92.63
కలిగిరి	3	24.32
వరికుంటపాడు	1	96.93
వింజమూరు	1	95
సైదాపురం	3	3.92
సూళ్లూరుపేట	3	94.84
కోట	4	18.82
వాకాడు	2	9.65
చిల్లకూరు	2	27.72

పెండింగ్ కేసులు త్వరితగతిన పరిష్కరించాలి

- హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్‌శ్రీనివాసరెడ్డి
- జిల్లాలోని న్యాయమూర్తులకు ఒక రోజు శిక్షణ



రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ శ్రీనివాసులు రెడ్డికి పూల మొక్క అందజేసి స్వాగతం పలుకుతున్న కలెక్టర్ హిమాన్షు శుక్లా, పక్కన జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి శ్రీనివాస్

నెల్లూరు (లీగల్): కోర్టుల్లో పెండింగ్ కేసులను త్వరితగతిన పరిష్కరించేందుకు న్యాయమూర్తులు చొరవ తీసుకోవాలని ఏపీ హైకోర్టు జడ్జి, జిల్లా న్యాయపాలన వ్యవహారాల జడ్జి జస్టిస్ కె.శ్రీనివాసరెడ్డి సూచించారు. జిల్లా కోర్టు ఆవరణలో ప్రధాన న్యాయమూర్తి కోర్టు హాల్లో జిల్లా స్థాయి న్యాయమూర్తులకు ఒక రోజు శిక్షణ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఏపీ హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తులు జస్టిస్ సీ ప్రవీణ్‌కుమార్, జి. సీతాపతి, జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి. శ్రీనివాస్ కోర్టుల్లో పెండింగ్ కేసులు, కేసుల సత్వర పరిష్కారానికి చర్యలపై న్యాయమూర్తులకు సూచనలు, సలహాలు ఇచ్చారు. న్యాయమూర్తుల సందేహాలను నివృత్తి చేశారు. ఈ కార్యక్రమంలో అదనపు జిల్లా జడ్జిలు గీత, సరస్వతి, తేజోవతి, శ్రీనివాసరావు, సోమశేఖర్, నికిత వోర, పలు కోర్టుల సీనియర్, జూనియర్ సివిల్ జడ్జిలు పాల్గొన్నారు.

న్యాయమూర్తులకు ఘన స్వాగతం

హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ శ్రీనివాసరెడ్డి, హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తులు సీ ప్రవీణ్‌కుమార్, జి సీతాపతిలకు జిల్లా ప్రధాన న్యాయమూర్తి శ్రీనివాస్, కలెక్టర్ హిమాన్షు శుక్లా, ఎస్పీ అజిత, మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ వై.ఓ నందన్ ఘన స్వాగతం పలికారు. తొలుత జస్టిస్ శ్రీనివాసరెడ్డి కోర్టు ప్రాంగణంలో మొక్కలను నాటారు. ఆయన మాట్లాడుతూ పర్యవరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కలను నాటి వాటిని సంరక్షించాలని సూచించారు. పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరు బాధ్యత అని గుర్తు చేశారు. కోర్టు ఆవరణ సుందరీకరణలో నెల్లూరు నగర పాలక సంస్థ కమిషనర్ వైఓ నందన్ చేస్తున్న కృషిని జస్టిస్ శ్రీనివాసరెడ్డి అభినందించి సన్మానించారు.

పేదల ఆరోగ్యానికి ఆపద

- రెండో రోజూ ఆరోగ్యశ్రీ సేవలు బంద్
- ఇబ్బందుల్లో రోగులు



ఆరోగ్యశ్రీ సేవలు నిలిపేసినట్లు నెల్లూరులోని ఓ ప్రైవేట్ ఆస్పత్రి ఎదుట ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ

నెల్లూరు (టౌన్): పేదల ఆరోగ్యానికి ఆపద వచ్చి పడింది. ప్రభుత్వం ఏడాది కాలానికి పైగా ఎన్టీఆర్ వైద్య సేవ (ఆరోగ్యశ్రీ)లకు బకాయిలు విడుదల చేయకపోవడంతో నెట్‌వర్క్ ఆస్పత్రుల యాజమాన్యాలు వైద్య సేవలు నిలిపివేశాయి. రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టిన సమ్మెలో భాగంగా శనివారం జిల్లాలోని అన్ని నెట్ వర్క్ ఆస్పత్రుల్లో వైద్య సేవలు నిలిపివేశారు. ప్రతి ఆస్పత్రి వద్ద ఆరోగ్యశ్రీ కింద వైద్య సేవలు నిలిపివేశామని బ్యానర్లు ఏర్పాటు చేశారు. గ్రామీణ ప్రాంతాల నుంచి స్పెషాలిటీ ఆస్పత్రులకు వైద్యం చేయించుకునేందుకు వచ్చారు. రోగులు ఎంత బతిమాలాడినా ఆరోగ్యశ్రీ కింద సేవలు అందించకపోవడంతో నిరాశ, నిస్పృహలతో వెనుతిరిగారు. జిల్లాలోని 35 నెట్‌వర్క్ ఆస్పత్రులు ఉండగా 30 ఆస్పత్రుల్లో వైద్యసేవలు నిలిపివేశారు. ఆంధ్రప్రదేశ్ స్పెషాలిటీ హాస్పిటల్స్ అసోసియేషన్ (ఆషా) రాష్ట్ర ఉపాధ్యక్షుడు, అరవింద్ కిడ్నీ వైద్యశాల అధినేత డాక్టర్ ఎస్‌వీఎల్ నారాయణరావు మాట్లాడుతూ ఆరోగ్యశ్రీ సేవలు నిలిపివేసినా ప్రభుత్వంలో ఏ మాత్రం చలనం లేదని, కనీసం చర్చలకు పిలవకపోవడం దారుణమన్నారు. బకాయిలు విడుదల చేసేంత వరకు సేవలు కొనసాగించే ప్రసక్తే లేదన్నారు.

రాజకీయంగా ఎదుర్కోలేకే తప్పుడు కేసులు

- దర్గామిట్ట పోలీస్‌స్టేషన్‌కు ప్రసన్న హాజరు



నెల్లూరులోని దర్గామిట్ట పోలీస్ స్టేషన్‌కు హాజరై సంతకం చేస్తున్న నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి

కోవూరు: మాకు న్యాయ వ్యవస్థపై అపార నమ్మకం ఉందని, ప్రజా నాయకుడిగా తానెప్పుడూ చట్టాన్ని ధిక్కరించలేదని మాజీమంత్రి, వైఎస్సార్‌సీపీ పీఏసీ సభ్యుడు నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి అన్నారు. అయితే తనను రాజకీయంగా ఎదుర్కొనే ధైర్యం లేక నా ప్రత్యర్థులు పోలీస్ వ్యవస్థను అడ్డం పెట్టుకుని నాపై తప్పుడు కేసులు బనాయించారని ఆరోపించారు. జూలై 31న వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రసన్నను పరామర్శించేందుకు వచ్చిన సందర్భంలో పోలీసులు ఆయనపై తప్పుడు కేసు బనాయించారు. ఈ కేసులో హైకోర్టు ఆదేశాల మేరకు శనివారం ఆయన నెల్లూరులోని దర్గామిట్ట పోలీస్‌స్టేషన్‌కు హాజరయ్యారు. సీఐ రోశయ్య, ఎస్ఐ సుబ్బారావు సమక్షంలో సంతకం చేశారు. ఈ సందర్భంగా ప్రసన్న మాట్లాడుతూ ఈ కేసులో తనకు హైకోర్టు నుంచి బెయిల్ మంజూరు కావడంతో కోర్టు షరతుల ప్రకారం పోలీస్‌స్టేషన్‌కు హాజరైనట్లు తెలిపారు. తనపై రాజకీయ ప్రేరేపిత కేసులు మోపారని, ఈ కేసుల నుంచి కోర్టు ద్వారానే న్యా యం జరుగుతుందని భావిస్తున్నట్లు తెలిపారు.

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు

- ఎస్పీ అజిత



నెల్లూరు (క్రైమ్): బాణసంచా అక్రమ తయారీ, విక్రయదారులపై కఠిన చర్యలు తప్పవని ఎస్పీ అజిత వేజెండ్ల ఒక ప్రకటనలో హెచ్చరించారు. జిల్లాలో బాణసంచా తయారీ కేంద్రాలు, స్టోరేజ్ గోడౌన్స్, విక్రయ దుకాణాల్లో సరైన భద్రతా ప్రమాణాలు పాటిస్తున్నారా? లేదా అనే విషయాలపై క్షుణ్ణంగా తనిఖీలు నిర్వహిస్తున్నామన్నారు. అక్రమ నిల్వలపై ఇందుకూరుపేటలో రెండు కేసులు, విడవలూరులో ఒకటి, కందుకూరులో ఒక కేసు నమోదు చేశామన్నారు. లైసెన్సులు కలిగిన వారే బాణసంచా తయారీ, విక్రయాలు నిర్వహించాలన్నారు. జిల్లాలో ఎక్కడైనా బాణసంచా అక్రమ విక్రయాలు, తయారీ, నిల్వలను గుర్తిస్తే వెంటనే స్థానిక పోలీసులకు లేదా డయల్ 11కు సమాచారం అందిస్తే తగిన చర్యలు తీసుకుంటామన్నారు. సమాచారం అందించే వ్యక్తుల వివరాలను గోప్యంగా ఉంచుతామని చెప్పారు.

అక్రమ నిర్మాణం తొలగింపు షురూ

సాక్షి ఎఫెక్ట్..



భవనాన్ని తొలగిస్తున్న కార్మికుడు

నెల్లూరు (బృందావనం): నెల్లూరు నగరపాలక సంస్థ పరిధిలో గుప్తాపార్కు సమీపంలో నిబంధనలకు విరుద్ధంగా నిర్మించిన భవనాన్ని తొలగించే చర్యలు షురూ అయ్యాయి. ఆ భవన యజమాని నిబంధనలకు విరుద్ధంగా బహుళ అంతస్తుల నిర్మాణం చేశారంటూ స్థానికులు నగరపాలక సంస్థ టౌన్‌ప్లానింగ్ అధికారులకు ఫిర్యాదు చేశారు. వారు ఎటువంటి చర్యలు తీసుకోకపోవడంతో ఫిర్యాదుదారుడు హైకోర్టును ఆశ్రయించారు. దీంతో స్పందించిన రాష్ట్ర సర్వోన్నత న్యాయస్థానం నిబంధనలకు విరుద్ధంగా నిర్మించిన బహుళ అంతస్తుల నిర్మాణంపై చర్యలు తీసుకోవాలంటూ నగరపాలక సంస్థ కమిషనర్‌ను ఆదేశిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. అయినప్పటికీ సంబంధిత అధికారులు స్పందించలేదు. ఈ క్రమంలో ఈ నెల 4వ తేదీన 'సాక్షి' పత్రికలో 'కట్టుకో.. పైసలిచ్చుకో..! శీర్షికన కథనం ప్రచురితమైంది. దీంతో మున్సిపల్ అధికారులు స్పందించి చర్యలకు ఉపక్రమించారు. దీంతో సదరు భవన యజమాని స్వయంగా తానే తొలగిస్తానని అధికారులకు విజ్ఞప్తి చేసి తన సొంత ఖర్చుతో కూలీలను పెట్టుకొని అక్రమ నిర్మాణాన్ని తొలగించే పనులు ప్రారంభించారు. ఇప్పటికే 50 శాతం పైగా నిర్మాణాన్ని తొలగించారు.

ఆ వృద్ధ దంపతులకు ఏ కష్టమొచ్చిందో?

- గుళికలు తిని ఆత్మహత్య
- అగ్రహారంలో విషాధచాయలు

కలువాయి (సైదాపురం): పాపం ఆ వృద్ధ దంపతులకు ఏ కష్టమొచ్చిందో ఏమో తెలియదు. పొలంలోకి వెళ్లి తిరిగి ఇంటికి వచ్చే సమయంలో గుళికలు తిని ఆవృద్ధ దంపతులు తుదిశ్వాస విడిచారు. కుటుంబ కలహాలు ఎక్కువ కావడంతో మనస్థాపంతో ఆత్మహత్యకు ఒడిగట్టారా వేరే ఏవైనా కారణాలు ఉన్నాయో తెలియదు. ఆ దంపతుల బలవన్మరణంతో కలువాయి మండలం అగ్రహారంలో శనివారం విషాదఛాయలు అలుముకున్నాయి. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. కలువాయి మండలం తోపుగుంట అగ్రహారం గ్రామానికి చెందిన వింజం కొండయ్య (70), అతని భార్య వింజం రత్నమ్మ (65) వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగించేవారు. కొంత కాలం నుంచి కుటుంబ కలహాలతో తీవ్రంగా మనస్తాపం చెందారని తెలుస్తోంది. ఈ నేపథ్యంలో భార్య, భర్త శనివారం పొలం పనులు చూసుకుని తిరిగి ఇంటికి వచ్చే సమయంలో గుళికలు తిని ఆత్మహత్యకు పాల్పడి మృతి చెందారని స్థానికులు తెలిపారు. గ్రామస్తుల ఫిర్యాదు మేరకు ఎస్ఐ కోటయ్య ఘటన స్థలానికి చేరుకుని విచారణ చేసి కేసును నమోదు చేసినట్లు తెలిపారు.

స్మార్ట్ స్ట్రీట్ వర్చువల్‌గా ప్రారంభం

నెల్లూరు (బృందావనం): నగరంలోని మైపాడుగేట్ సెంటర్‌లో రూ.7 కోట్లతో ఏర్పాటు చేసిన స్మార్ట్ స్ట్రీట్‌ను సీఎం చంద్రబాబు శనివారం వర్చువల్‌గా ప్రారంభించారు. షాపులు పొందిన మహిళలకు మంత్రి నారాయణ సీఎం సమక్షంలో పట్టాలు పంపిణీ చేశారు. వారితో వర్చువల్‌గా సీఎం చంద్రబాబు ఇంటరాక్ట్ అయ్యారు. మంత్రి నారాయణ మాట్లాడుతూ రాష్ట్రంలో తొలి స్మార్ట్ స్ట్రీట్ బజార్‌ను నెల్లూరు నగరంలో ప్రారంభించామన్నారు. రాష్ట్రంలో 8 మున్సిపాలిటీల్లో పైలెట్ ప్రాజెక్ట్‌గా స్మార్ట్ స్ట్రీట్‌లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ హిమాన్షు శుక్లా, మెప్మా ఎండీ తేజ్‌భరత్, నెల్లూరు నగరపాలక సంస్థ కమిషనర్ నందన్, టీడీపీ నేతలు అబ్దుల్ అజీజ్, కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, వేమిరెడ్డి పట్టాభిరామిరెడ్డి, డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

జిల్లా స్థాయి యువజనోత్సవాలకు ఆహ్వానం

నెల్లూరు రూరల్‌: స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకొని యువజనోత్సవాలను నగరంలోని డీకేడబ్ల్యూ ప్రభుత్వ కళాశాలలో ఈ నెల 23న నిర్వహించనున్నామని సెట్నెల్‌ సీఈఓ నాగేశ్వరరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 15 నుంచి 29 ఏళ్లలోపు వారికి ఫోక్‌ డ్యాన్స్‌, ఫోక్‌ సాంగ్‌ గ్రూప్‌, స్టోరీ రైటింగ్‌, పెయింటింగ్‌, పొయెట్రీ రైటింగ్‌ తదితరాల్లో పోటీలను నిర్వహించనున్నామని వివరించారు. జిల్లా స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచిన వారు రాష్ట్ర స్థాయికి.. అక్కడ ఉత్తమ ప్రతిభ చూపిన వారు జాతీయ స్థాయి పోటీలకు అర్హత సాధించనున్నారని వెల్లడించారు. ఆసక్తి గల వారు తమ పేర్లను ఈ నెల 18లోపు నమోదు చేసుకోవాలని, వివరాలకు 94407 84755 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

గుర్తుతెలియని మృతదేహం లభ్యం



సీతారామపురం: మండలంలోని పండ్రంగి గ్రామ స్వామిచెరువు సమీపంలో గల అటవీ ప్రాంతంలో పొదల్లో గుర్తుతెలియని మృతదేహాన్ని పోలీసులు శనివారం గుర్తించారు. మృతదేహంపై దుస్తుల్లేకపోవడం.. తలపై పెద్ద రాళ్లు పడి ఉండటం.. కుళ్లిపోయి ఉండటంతో హత్య జరిగి ఉండొచ్చనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఘటన స్థలానికి ఉదయగిరి సీఐ వెంకట్రావు చేరుకొని మృతదేహాన్ని పరిశీలించి పోస్ట్‌మార్టం నిమిత్తం ఉదయగిరి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

శ్రీగంధం చెట్టు నరికివేత



ఉదయగిరి రూరల్‌: మండలంలోని మాసాయిపేట బీసీ కాలనీ సమీపంలో గల గానుగపెంటపల్లికి చెందిన రైతు నారాయణరెడ్డి పొలంలో శ్రీగంధం చెట్టును గుర్తుతెలియని వ్యక్తులు నరికి తీసుకెళ్లిన ఘటన శనివారం వెలుగులోకి వచ్చింది. రైతు వివరాల మేరకు.. పొలంలో శ్రీగంధం చెట్లను 35 ఏళ్లుగా పెంచుతున్నానని చెప్పారు. మూడేళ్ల క్రితం సైతం ఇలానే 16 చెట్లను నరికి తీసుకెళ్లడంతో పోలీసులకు ఫిర్యాదు చేయగా, నిందితులను వారు అరెస్ట్‌ చేసి స్వాధీనం చేసుకున్నారని వివరించారు. తాజాగా ఒక చెట్టును నరికి తీసుకెళ్లారని, దీని విలువ రూ.ఏడెనిమిది లక్షలుంటుందని చెప్పారు. ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేశానన్నారు.

..ప్చ్‌.. పొరపాటైందే..!

- డీఎస్డీఓగా యతిరాజే కొనసాగింపు..?
- ఉద్యోగ విరమణ పొందాకే పాండురంగారావు నియామకం


నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): జిల్లా క్రీడాభివృద్ధి అధికారిని మార్చి తాము పొరపాటు చేశామనే భావన రాష్ట్ర క్రీడాప్రాధికార సంస్థలో వ్యక్తమవుతోందని తెలుస్తోంది. వాస్తవానికి డీఎస్డీఓను మారుస్తున్నట్లు రాష్ట్ర క్రీడాప్రాధికార సంస్థ ద్వారా ఉత్తర్వులను ప్రభుత్వం శుక్రవారం జారీ చేసింది. మరోవైపు ఈ స్థానంలో ఉన్న యతిరాజ్‌ ఈ నెలాఖరులో ఉద్యోగ విరమణ పొందనున్నారు. విషయాన్ని తెలుసుకున్న రాష్ట్ర క్రీడాప్రాధికార సంస్థ అధికారులు.. పొరపాటు జరిగిపోయిందని.. రిటైరయ్యేంత వరకు ఆయనే ఉంటారని చెప్పారని విశ్వసనీయ సమాచారం. ఆ తర్వాతే ఫుట్‌బాల్‌ కోచ్‌ పాండురంగారావును డీఎస్డీఓగా నియమించనున్నారని తెలుస్తోంది. రాష్ట్ర క్రీడాప్రాధికార సంస్థకున్న అవగాహన ఈ వ్యవహారంతోనే స్పష్టమవుతోందని సీనియర్‌ క్రీడాకారులు పేర్కొంటున్నారు.

అనుమానాస్పద స్థితిలో గూడ్స్‌ గార్డు మృతి



కావలి (అల్లూరు): అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి చెందిన ఘటన కావలి రూరల్‌ పరిధిలోని రుద్రకోట జాతీయ రహదారి పక్కన చోటుచేసుకుంది. రూరల్‌ పోలీసుల వివరాల మేరకు.. ప్రకాశం జిల్లా కరవాదికి చెందిన సూర్యనారాయణ (36) బిట్రగుంట రైల్వేస్టేషన్లో గూడ్స్‌ గార్డుగా పనిచేస్తున్నారు. ఈ క్రమంలో విధుల నిమిత్తం కరవాది నుంచి ద్విచక్రవాహనంపై బిట్రగుంటకు వస్తుండగా మృతి చెందారు. కాలువలో మృతదేహం లభ్యంకావడంతో అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పొదలకూరు నిమ్మ ధరలు



పెద్దవి: రూ.40
సన్నవి: రూ.25
పండ్లు: రూ.15

పౌల్ట్రీ అసోసియేషన్‌ ధరలు



బ్రాయిలర్‌:	రూ.118
లేయర్‌	రూ.122
బ్రాయిలర్‌ చికెన్‌:	రూ.214
స్కిన్‌లెస్‌ చికెన్‌:	రూ.236
లేయర్‌ చికెన్‌:	రూ.207

శుభకార్యానికెళ్తూ.. అనంతలోకాలకు



విగతజీవిగా సహస్ర

- ఫోన్లో మాట్లాడే క్రమంలో ఏమరుపాటు
- డివైడర్‌ను వేగంగా ఢీకొన్న కారు
- రోడ్డు ప్రమాదంలో తాత, మనవరాలి మృతి



మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు



నుజ్జునుజ్జయిన కారు

ఆత్మకూరు: కారు నడుపుతూ ఫోన్లో మాట్లాడే క్రమంలో ఏమరుపాటుగా వ్యవహరించడంతో డివైడర్‌ను వాహనం ఢీకొని తాత, మనవరాలు మృతి చెందిన ఘటన మండలంలోని కరటంపాడు సమీపంలో గల నెల్లూరు – ముంబై జాతీయ రహదారిపై శనివారం చోటుచేసుకుంది. ఎస్సై జిలానీ వివరాల మేరకు.. నెల్లూరులోని బీవీనగర్‌కు చెందిన జలసత్రం వేమయ్య (54), తమ సమీప బంధువుల శుభకార్యం నిమిత్తం బద్వేల్‌కు కుమార్తె మొగిలి మౌనిక, మనవరాలు సహస్ర (2), మనవడు యశ్వంత్‌తో కలిసి కారులో బయల్దేరారు. ఈ తరుణంలో ఆత్మకూరు మండలం కరటంపాడు సమీపంలోని గిరిజన కాలనీ వద్ద వేమయ్యకు ఫోన్‌ రావడంతో మాట్లాడే యత్నంలో ఎదురుగా ట్యాంకర్‌ వస్తుండటంతో దానికి దారిచ్చే క్రమంలో కారు అదుపుతప్పి డివైడర్‌ను వేగంగా ఢీకొంది. దీంతో డ్రైవింగ్‌ చేస్తున్న వేమయ్య అక్కడికక్కడే మృతి చెందారు. మౌనిక, చిన్నారి సహస్ర తీవ్రంగా, యశ్వంత్‌ స్వల్పంగా గాయపడ్డారు. సమీపంలోని గిరిజన కాలనీ వారు ఘటన స్థలానికి చేరుకొని క్షతగాత్రులను 108లో ఆత్మకూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడికెళ్లిన పది నిమిషాలకే సహస్ర మృతి చెందింది. మౌనికకు చికిత్సను అందిస్తున్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బోల్తాపడిన ప్రైవేట్‌ బస్సు

- భువనేశ్వర్‌ నుంచి బెంగళూరు వెళ్తుండగా ఘటన
- చిన్నారికి తీవ్రగాయాలు
- స్వల్ప గాయాలతో బయటపడిన ప్రయాణికులు



ప్రమాదానికి గురైన బస్సు



రోడ్డుపై బిక్కుబిక్కుమంటూ ప్రయాణికులు

కోవూరు: ప్రైవేట్‌ ట్రావెల్స్‌ బస్సు బోల్తాపడిన ఘటన పట్టణంలోని ఆర్కే పెట్రోల్‌ బంక్‌ వద్ద జాతీయ రహదారిపై శనివారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. వివరాలు.. ఒడిశాలోని భువనేశ్వర్‌ నుంచి బెంగళూరుకు 40 మంది ప్రయాణికులతో నవీన్‌ ట్రావెల్స్‌ బస్సు బయల్దేరింది. ఈ తరుణంలో నిద్రమత్తులోకి డ్రైవర్‌ జారుకోవడంతో వాహనం నియంత్రణ కోల్పోయి రోడ్డు పక్కకు దూసుకెళ్లింది. ఈ హఠాత్పరిణామంతో ప్రయాణికులు భయాందోళనలకు గురయ్యారు. ప్రమాదంలో పది మంది స్వల్పంగా గాయపడగా, తిరుపతికి చెందిన చిన్నారి సమ్విక తీవ్రంగా గాయపడింది. చిన్నారిని నెల్లూరులోని అపోలో ఆస్పత్రికి తరలించారు. మిగిలిన వారు స్థానిక ప్రైవేట్‌ ఆస్పత్రుల్లో ప్రాథమిక చికిత్స పొందారు. ఆపై గమ్యస్థానాలకు బయల్దేరారు. ప్రమాదం జరిగే సమయానికి బస్సు అతివేగంతో వస్తోందని సమాచారం. విషయం తెలుసుకున్న కోవూరు ఇన్‌స్పెక్టర్‌ సుధాకర్‌రెడ్డి, ఎస్సై రంగనాథ్‌గౌడ్‌ సిబ్బందితో కలిసి ఘటన స్థలానికి చేరుకొని పరిశీలించారు. వాహనాన్ని క్రేన్‌ సాయంతో రోడ్డుపైకి లాగించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదాలను అరికట్టాలి

- ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి



మాట్లాడుతున్న సర్వశ్రేష్ఠ త్రిపాఠి

మనుబోలు: రోడ్డు ప్రమాదాల నివారణకు పటిష్ట చర్యలు చేపట్టాలని గుంటూరు రేంజ్‌ ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి ఆదేశించారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌ను ఆకస్మికంగా శనివారం తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. స్థానిక పరిస్థితులపై సిబ్బందిని ఆరాతీసిన అనంతరం ఆయన మాట్లాడారు. హైవేపై ప్రమాదాల నివారణకు అన్ని చర్యలు చేపట్టాలని సూచించారు. ధాభాలు , ఇతర చోట్ల జాతీయ రహదారిని ఆనుకొని లారీలను ఆపకుండా చర్యలు చేపట్టాలని చెప్పారు. యూటర్న్‌లు, ప్రమాదాలు ఎక్కువగా జరిగే అవకాశం ఉన్న క్రాస్‌రోడ్లను గుర్తించాలని సూచించారు. మండలంలోని 19 గ్రామాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేశామని ఎస్సై శివరాకేష్‌ తెలిపారు. డీఎస్పీ శ్రీనివాసరావు, సీఐ శివరామకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రైలు కిందపడి వ్యక్తి బలవన్మరణం

నెల్లూరు(క్రైమ్‌): పినాకినీ ఎక్స్‌ప్రెస్‌ కిందపడి గుర్తుతెలియని వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన వేదాయపాళెం రైల్వే గేట్‌ సమీపంలో శనివారం సాయంత్రం చోటుచేసుకుంది. మృతుడు సుమారు 45 నుంచి 50 ఏళ్లలోపు వయస్సు కలిగి.. తెలుపు రంగు ఫుల్‌ హ్యాండ్స్‌ చొక్కా.. బ్లూ రంగు నైట్‌ ప్యాంట్‌ను ధరించి ఉన్నారు. సమాచారం అందుకున్న నెల్లూరు రైల్వే ఎస్సై హరిచందన ఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని జీజీహెచ్‌ మార్చురీకి తరలించారు. ఎస్సై కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ముళ్ల పొదల్లోకి దూసుకెళ్లిన లారీ



సంగం: ముళ్ల పొదల్లోకి లారీ దూసుకెళ్లిన ఘటన సంగం కొండ కూడలి సమీపంలో శనివారం చోటుచేసుకుంది. వివరాలు.. ఆత్మకూరు వైపు నుంచి కర్ణాటకకు చెందిన లారీ వస్తోంది. ఈ తరుణంలో ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించే క్రమంలో రోడ్డు పక్కన రక్షణ కోసం ఏర్పాటు చేసిన కమ్ములను ఢీకొని ముళ్ల పొదల్లోకి దూసుకెళ్లింది. ప్రమాదంలో డ్రైవర్‌ స్వల్పంగా గాయపడగా, లారీ ముందు భాగం నుజ్జునుజ్జయింది.

లింక్‌ పంపి.. నగదును కొల్లగొట్టి

- సైబర్‌ నేరగాళ్ల వలలో వడ్ల దళారి
- రూ.4.81 లక్షలు మాయం

సంగం: సైబర్‌ నేరాలపై పోలీసులు తరచూ అవగాహన కల్పిస్తున్నా.. పలువురు మోసపోతూనే ఉన్నారు. తాజాగా వీరి వలలో పడి వడ్ల దళారి మోసపోయిన ఘటన శనివారం వెలుగులోకి వచ్చింది. వివరాలు.. మండలంలోని చెన్నవరప్పాడుకు చెందిన చేజర్ల కోటయ్యకు డబ్బులు పడినట్లుగా ఓ నంబర్‌ నుంచి ఓటీపీ లింకు గురువారం ఉదయం వచ్చింది. దీన్ని ఓపెన్‌ చేయగా, రూ.మూడు లక్షల నగదు డెబిట్టైనట్లు మెసేజ్‌ వచ్చింది. 12 గంటల తర్వాత మరో రూ.1.81 లక్షల నగదు మాయమైంది. తన వద్ద ఉన్న రూ.పది లక్షల్లో రూ.4.81 లక్షలు డెబిట్‌ అవడంతో ఆందోళనకు గురైన ఆయన సంగం పోలీసులను ఆశ్రయించారు. నెల్లూరులో ఫిర్యాదు చేయాలని వారు సూచించడంతో సైబర్‌ పోలీసులకు తెలియజేశారు. దీంతో వారు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆర్థరైటిస్‌పై నిర్లక్ష్యం వహిస్తే ముప్పే



బ్రోచర్లను ఆవిష్కరిస్తున్న వైద్యులు

నెల్లూరు (టౌన్‌): ఆర్థరైటిస్‌ సమస్యను నిర్లక్ష్యం చేస్తే భవిష్యత్తులో శరీర వైకల్యాలొచ్చే ప్రమాదం ఉందని బాలాజీనగర్‌ ఇన్‌స్పెక్టర్‌ సాంబశివరావు పేర్కొన్నారు. ప్రపంచ ఆర్థరైటిస్‌ డేను పురస్కరించుకొని వాకథాన్‌ను అపోలో సూపర్‌స్పెషాల్టీ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. ఆర్థరైటిస్‌కు అపోలోలో తక్కువ ఫీజుతో అందించే స్క్రీనింగ్‌ పరీక్షల బ్రోచర్లను వైద్యులతో కలిసి డైరెక్టర్‌ ఆఫ్‌ మెడికల్‌ సర్వీసెస్‌ శ్రీరామ్‌ సతీష్‌ ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడారు. రూ.4590 విలువగల తొమ్మిది రకాల ఆర్థరైటిస్‌ స్క్రీనింగ్‌ పరీక్షలను రూ.1999కే అందించనున్నామని వివరించారు. రూ.8590 విలువగల మరో స్క్రీనింగ్‌ పరీక్షను రూ.3999కే చేయనున్నామని, ఈ అవకాశం డిసెంబర్‌ 31 వరకు అందుబాటులో ఉంటుందని చెప్పారు. ఆర్థోపెడిక్‌ సీనియర్‌ సర్జన్లు వివేకానందరెడ్డి, శశిధర్‌రెడ్డి, విక్రమ్‌రెడ్డి, యూనిట్‌ హెడ్‌ బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

కల్యాణం.. కమనీయం



రాపూరు: మండలంలోని పెంచలకోన క్షేత్రంలో పెనుశిల లక్ష్మీనరసింహస్వామి, ఆదిలక్ష్మి, చెంచులక్ష్మి కల్యాణాన్ని నేత్రపర్వంగా శనివారం నిర్వహించారు. స్వామి, అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలను నిత్య కల్యాణ మండపంలో కొలువుదీర్చి ఆభరణాలు, పుష్పాలతో అలంకరించారు. అనంతరం వేదపండితుల మంత్రోచ్ఛారణల నడుమ కల్యాణాన్ని నిర్వహించారు. సహస్ర దీపాలంకరణ మండపంలో ఊంజల్‌ సేవను సాయంత్రం జరిపారు.

దాడి చేసింది ఎన్‌ఫోర్స్‌మెంట్‌ స్క్వాడ్‌ కాదు

ఆత్మకూరు: చేజర్ల మండలం మాముడూరులో బెల్టు దుకాణంపై దాడి చేయడంలో జిల్లా ఎన్‌ఫోర్స్‌మెంట్‌ స్క్వాడ్‌కు.. ఇన్‌స్పెక్టర్‌ అనితకు సంబంధం లేదని జిల్లా ప్రొహిబిషన్‌ అండ్‌ ఎక్సైజ్‌ ఎన్‌ఫోర్స్‌మెంట్‌ ఏసీ దయాసాగర్‌ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సదరు బెల్టు దుకాణంపై దాడిలో తమ అధికారులెవరూ పాల్గొనలేదని, నెల్లూరులో గంజాయిని పట్టుకునే విధుల్లో సిబ్బంది ఉన్నారని ఆయన వివరించారు.

ఏపీ ఎన్జీఓ అసోసియేషన్‌ జిల్లా అధ్యక్షుడి మృతి



పెంచలరావు (ఫైల్‌)

నెల్లూరు (బృందావనం): ఏపీ ఎన్జీఓ అసోసియేషన్‌ జిల్లా అధ్యక్షుడు, జేఏసీ చైర్మన్‌, వైద్యశాఖ ఉద్యోగి మన్నేపల్లి పెంచలరావు (51) అనారోగ్యంతో చెన్నైలో చికిత్స పొందుతూ శనివారం రాత్రి మృతి చెందారు. అనంతసాగరం మండలానికి చెందిన ఈయన ఉద్యోగ సంఘ నేతగా వారి హక్కుల పరిరక్షణకు సుదీర్ఘ పోరాటాలు చేశారు. ఆయన మృతి ఉద్యోగ సంఘానికి తీరని లోటని పలువురు పేర్కొన్నారు. కుటుంబసభ్యులకు తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

కండలేరులో 59.50 టీఎంసీలు

రాపూరు: కండలేరు జలాశయంలో శనివారం నాటికి 59.50 టీఎంసీల నీరు నిల్వ ఉందని ఈఈ గజేంద్రరెడ్డి తెలిపారు. సోమశిల జలాశయం నుంచి 3400 క్యూసెక్కుల నీరు చేరుతోందని చెప్పారు. కండలేరు నుంచి సత్యసాయి గంగకు 1700, పిన్నేరుకు 200, లోలెవల్‌కు 40, హైలెవల్‌కు 200, మొదటి బ్రాంచ్‌ కాలువకు ఐదు క్యూసెక్కులను విడుదల చేస్తున్నామని వివరించారు.

యాసిడ్‌ డ్రమ్ములు చెల్లాచెదురు



మర్రిపాడు: మండలంలోని నందవరం – కంద్రిక మార్గ మధ్యలో నెల్లూరు – ముంబై జాతీయ రహదారిపై యాసిడ్‌ లోడ్‌తో వెళ్తున్న ఓ వాహనం బోల్తాపడింది. బద్వేల్‌ నుంచి నెల్లూరువైపు వెళ్తున్న వాహనం అదుపుతప్పడంతో అందులోని యాసిడ్‌ డ్రమ్ములు రోడ్డుపై చెల్లాచెదురుగా పడిపోయాయి. డ్రైవర్‌ స్వల్పంగా గాయపడ్డారు.